

## ఆదరణ లేక మరోసారి..

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకంపై ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకుంటే... తట్టెడు మంది కూడా స్పందించలేదు. దీంతో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ద్వారా వేల కోట్ల ఆదాయం ఆడియాశలయ్యాయి. మార్చి 31 వరకు ఫీజులు చెల్లించిన వారికి 25శాతం రాయితీ ఇచ్చినా.. దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. దీంతో గడువు ముగియడంతో.. ఏప్రిల్ 30 వరకు 25శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించింది. హెచ్ఎండీఏ పరిధిలో 3.45లక్షల మంది, జీహెచ్ఎంసీ పరిధిలో 1.5లక్షల మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొని ఉన్న స్తబ్ధత కారణంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు ఆశించిన స్థాయిలో ఆదరణ రాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పెంచారు.


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 3 ఏప్రిల్ 2025 | HYDERABAD


## మూడు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల మూడు రోజులు గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.8, కనిష్ఠం 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 36 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.





హెచ్‌సీయూ వద్ద పోలీసు బలగాలు

# విద్యార్థులపై దమననీతి

- ఆందోళనలతో అట్టుడుకిన నగరం
- ప్రభుత్వ తీరుకు నిరసన
- గళమెత్తిన నగరవాసులు
- నేడు సెక్రటేరియట్ ముట్టడికి
- వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

సిటీబ్యూరో: అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ పరిసరాలు ఉద్యమ రోజులను తలపిస్తున్నాయి. వీరికి మద్దతుగా నగర వాసులు, పర్యావరణ ప్రేమికులు అరుదైన జీవ వైవిధ్యాన్ని కలిగిన హెచ్‌సీయూ భూములను రక్షించాలంటూ ఆర్తనాదాలతో రోడ్డెక్కుతున్నారు. ఇక వట ఫౌండేషన్ ఇప్పటికే హెచ్‌సీయూ భూముల కోసం హైకోర్టును ఆశ్రయించగా, పెరుగుతున్న పౌర సమాజం మద్దతుతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో నగరంలో హెచ్‌సీయూ పరిరక్షణ కోసం ఆందోళనలు, నిరసనలతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తంగా మారాయి. ఇక సోషల్ మీడియాలోనూ సేవ్‌హెచ్‌సీయూ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ కొనసాగుతున్నది.

### మూగజీవాల అరణ్య రోదన

మూగజీవాల అరణ్య రోదనలకు నగరం చలించిపోతున్నది. వన్యప్రాణులకు ఆవాసమైన హెచ్‌సీయూ భూముల కోసం ముక్తకంఠంతో గొంతెత్తుతున్నారు. అరుదైన రాతి సంపద, అంతకు మించిన వృక్ష సంపదను కాపాడుకునేందుకు గడిచిన ఐదు రోజులుగా నగరవాసుల భాగస్వామ్యం పెరుగుతూనే ఉంది. విద్యార్థులకు మద్దతుగా ఓవైపు సెలబ్రిటీలు, మరోవైపు రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ కుట్రపూరిత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. వీరికి మద్దతుగా నగరంలోనూ పలు చోట్ల నిరసన తెలుపుతూ సేవ్ హెచ్‌సీయూకు మద్ధతు తెలుపుతున్నారు. బుధవారం నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు నిరసన తెలిపారు. కేబీఆర్ పార్క్ వద్ద బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ప్రకృతిని కాపాడంటూ విద్యార్థులతో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గొంతెత్తారు. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం ఆధ్వర్యంలోనూ ప్రొఫెసర్లు గళమెత్తారు.

### పెరుగుతున్న మద్దతు..

విద్యార్థులకు మద్దతు తెలుపుతూ సినీ ప్రముఖులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద, పర్యావరణ పరిరక్షణ సంఘాలు కూడా ఉద్యమిస్తున్నాయి.ఈ క్రమంలో సేవ్ హెచ్‌సీయూ హ్యాష్ ట్యాగ్ ట్రెండవుతున్నది. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఇతర వామపక్ష విద్యార్థి సంఘాలు భూముల అన్యాక్రాంతంపై అడ్డుకునేలా గురువారం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చాయి.

### వర్సిటీని సందర్శించిన అధికారుల బృందం

మియాపూర్: బల్దియా అధికారుల బృందం యూనివర్సిటీని బుధవారం సందర్శించింది. అడ్మినిస్ట్రేటివ్ భవనం వరకు వెళ్లి అధికారాలతో మాట్లాడేందుకు ప్రయత్నించింది. అక్కడ వందలాది విద్యార్థులు ఆందోళన చేపడుతుండడంతో వెను తిరిగింది.





వర్సిటీ విద్యార్థులపై లాఠీలతో విరుచుకుపడుతున్న పోలీసులు

### విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం అమానుషం

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించకుండా పోరాడుతున్న విద్యార్థులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం కూకట్‌పల్లి క్యాంప్ ఆఫీసులో మీడియాతో ఆయన మాట్లాడుతూ... అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హెచ్‌సీయూకి కేటాయించిన భూములను నేడు ఇందిరమ్మ వారసులు అమ్ముకోవడానికి చూస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాడుతున్నదని.. విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటుందని తెలిపారు. భూములను కాపాడేందుకు పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం అమానుషమన్నారు.



హెచ్‌సీయూ భూములు కాపాడాలంటూ..ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సీపీఎం నేతల నిరసన

## ఏడాదిలో రెండు సార్లు.. లాఠీలు ఝుళిపించి..

సిటీబ్యూరో: నాడు గ్రూప్-1 అభ్యర్థులపై.. నేడు హెచ్‌సీయూ విద్యార్థులపైన.. ఏడాది కాలంలో రెండు సార్లు పోలీసు లాఠీ విరిగింది. తమ న్యాయమైన డిమాండ్ కోసం గతేడాది జూలై, ఆగస్టులో రోడెక్కిన గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసులతో లాఠీచార్జీ చేయించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా భూములను వేలం వేయవద్దంటూ నిరసనకు దిగిన హెచ్‌సీయూ విద్యార్థులపై మరోసారి లాఠీలు ఝుళిపించింది. విద్యార్థులకు అన్నివిధాలుగా అండగా ఉంటామంటూ.. నాడు హెచ్‌సీయూను సందర్శించిన రాహుల్ గాంధీ.. 2023లో జరిగిన ఎన్నికల ప్రచారంలో చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీకి వచ్చి, గ్రూప్స్‌నకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉద్యోగవకాశాలు కల్పించి, అండగా ఉంటామంటూ మాట ఇచ్చారు. ఆనాడు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ సందర్శించిన హెచ్‌సీయూ, అశోక్‌నగర్ రెండు ప్రాంతాల్లోనూ నేడు రేవంత్ సర్కార్ పోలీసు లాఠీలతో విద్యార్థులపై విరుచుకుపడటం గమనార్హం.



సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద..పోలీసుల దిగ్బంధం



ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద..




## ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే..

ఖైరతాబాద్, ఏప్రిల్ 2 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంపై వేటు పడాలని నియోజకవర్గ కాంగ్రెస్ అసమ్మతి నేతలు వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఖైరతాబాద్‌లో అసెంబ్లీ ఉప ఎన్నిక అనివార్యమైతే 30 ఏండ్లుగా నిరంతారయంగా కాంగ్రెస్‌లో ఉన్న రాజు యాదవ్‌కు టికెట్ కేటాయించాలంటూ ఇటీవల కేబీఆర్ పార్కు వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పేరుతో ఓ భారీ ఫ్లెక్సీ వెలియడంతో ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. తాజాగా మళ్లీ అదే ఫ్లెక్సీ ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ వద్ద బుధవారం వెలిసింది. కాంగ్రెస్ అధిష్టానం వర్గంతో పాటు ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్ రాజు యాదవ్ ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని చూస్తే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ మేరకు ఉందో స్పష్టమవుతున్నది. ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని రకాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పారిశుధ్యం లోపించింది. తరచూ శాంతిభద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే స్థానిక కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కావడంతో డివిజన్‌ను గాలికి వదిలేయగా, కనీసం నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పట్టించుకునేందుకు ఎమ్మెల్యే కూడా అందుబాటులో లేరని ప్రజలు వాపోతున్నారు. ఏడాది కాలంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్ని సార్లు నియోజకవర్గంలో పర్యటించారో వేళ్లపై లెక్కపెట్టి చెప్పవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ పై వేటు పడాలని సొంత పార్టీ వారే బలంగా కోరుకోవడం విశేషం.

# రాత్రికి రాత్రే చొచ్చుకొచ్చి..

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు బయట జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలంలో 480 గజాల స్థలాన్ని మల్టీ లెవల్ పార్కింగ్ కోసం నవ నిర్మాణ్ అసోసియేట్స్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించారు. తనకు కేటాయించిన స్థలానికి అదనంగా పార్కింగ్ లాట్‌లో ఉన్న సుమారు 100 గజాల స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకున్న నిర్మాణ సంస్థ.. ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రారంభంలో ఉన్న డిజైన్‌ను మార్చేసి సుమారు 100 గజాల పార్కు స్థలంలోకి చొచ్చుకువచ్చిన సదరు సంస్థ.. జీహెచ్ఎంసీకి చెందిన ప్రహరీని కూల్చేసింది. ఈ వ్యవహారంపై కేబీఆర్ పార్కు వాకర్లతో పాటు సందర్శకులు జీహెచ్ఎంసీ మేయర్‌తో పాటు జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా ప్రహరీని కూల్చడంతో పాటు రోడ్డు కోసమంటూ లోనికి చొచ్చుకు రావడం సరికాదని, ఒకవేళ అదనపు స్థలం కావాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలంటూ సూచించిన బల్దియా అధికారులు.. అక్రమంగా నిర్మించిన ప్రహరీని రెండ్రోజుల కిందట కూల్చేశారు. అయితే ప్రభుత్వంలోని కీలక వ్యక్తులతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తనను ఎవరూ ఏమీచేయలేరంటూ సదరు సంస్థ యాజమాన్యం జీహెచ్ఎంసీ కూల్చేసిన ప్రహరీని మంగళవారం రాత్రి తిరిగి కట్టేసి అధికారులకు సవాల్ విసిరింది.



సోమవారం నాడు అక్రమంగా కట్టిన ప్రహరీని కూలుస్తున్న జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది



బుధవారం నాడు మరోసారి జీహెచ్ఎంసీ స్థలంలోకి వచ్చి నిర్మించిన గోడ



# ఒక్క పశ్చిమానే రియల్టీ..!!

### మిగిలిన మూడు వైపులా.. కళ తప్పిన హైరైజ్డ్ కళ

సిటీబ్యూరో : జీహెచ్ఎంసీలో ఆకాశహర్మ్యాల కళ తప్పింది. గత ఆర్థిక సంవత్సరంలో 130 హైరైజ్డ్ బిల్డింగ్‌లకు అనుమతులు లభించగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 102 చోట్ల మాత్రమే అనుమతులు జారీ చేశారు. ఎక్కువగా పశ్చిమాన మాత్రమే ఈ కళ సంతరించుకోవడం విశేషం. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలుకావడంతో 2024-25 ఆర్థిక సంవత్సరం గణంకాలను టౌన్‌ప్లానింగ్ విభాగం బుధవారం వెల్లడించింది. గతంలో కంటే ఈ సారి రెసిడెన్షియల్ తప్ప హైరైజ్డ్ బిల్డింగ్‌లు ఎక్కువగా లేకపోవడం, ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లి పెట్టుబడులు భారీ కంపెనీలు ముందుకు రాకపోడమే ఇందుకు నిదర్శమని నిర్మాణ రంగ నిపుణులు తెలిపారు. కొండాపూర్‌లో 50 అంతస్తుల భవనానికి అనుమతి మంజూరు కాగా, మరో ఐదు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని అధికారులు తెలిపారు.

**వార్షిక నివేదిక ప్రకారం.. నిర్మాణ రంగ అనుమతులు**

| కేటగిరి | అనుమతుల సంఖ్య |
|---|---|
| ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ | 523 |
| ఇన్‌స్టంట్ అప్రూవల్ | 8377 |
| సింగిల్ విండో | 2422 |
| లే అవుట్ విత్ హౌసింగ్ | 6 |
| లే అవుట్ విత్ ఓపెన్ ప్లాట్ | 5 |
| అక్యూపెన్సీ సర్టిఫికెట్ | 2088 |

**కేటగిరీల వారీగా అనుమతులు పరిశీలిస్తే..**

| కేటగిరీ | నాన్ హైరైజ్డ్ | హైరైజ్డ్ | మొత్తం |
|---|---|---|---|
| కమర్షియల్ | 112 | 28 | 140 |
| హాస్పిటల్, సంస్థలు | 19 | 27 | 46 |
| రెసిడెన్షియల్ | 2189 | 47 | 2236 |

# గస్తీ లేదు.. నిఘా కరువు

- ఈ నగరానికి ఏమైంది..!
- రోజుకు సగటున నాలుగైదు నేరాలు
- రోడ్లపైనే హత్యలు, మహిళలకు వేధింపులు
- గతమెంతో ఘనమంటున్న నగరవాసులు

సిటీబ్యూరో: రోజుకో హత్య లేక ఎక్కడో ఒకచోట మహిళలకు వేధింపులు.. ఇవి చాలవన్నట్లు కిడ్నాప్‌లు.. అడపాదడపా దోపిడీలు, దొంగతనాలు.. ఈజీగా మారిన గన్‌ఫైరింగ్.. ఒకటేమిటి.. అన్ని నేరాలకు కేరాఫ్‌గా గ్రేట్ హైదరాబాద్ మారిపోయింది. 2023 నుంచి 2024కు క్రైమ్ రేట్ కొంతమేరకు పెరిగితే ఈ సంవత్సరం మొదటి మూడు నెలల్లోనే సుమారుగా 166కిపైగా హత్యలు, దొంగతనాలు వంటి ప్రధాన నేరాలు జరుగుతుంటే చిన్నాచితకా నేరాల లెక్క వీటికి రెట్టింపు సంఖ్యలో నమోదయ్యాయి. ఇక మహిళలపై వేధింపుల ఘటనలు సుమారుగా 86 వరకు నమోదైనట్లు పోలీసులు చెప్పారు. అసలు కమిషనరేట్‌లో పోలీసింగ్ పట్టు తప్పుతోందా.. లేక నేరస్తుల్లో భయం తగ్గుతోందా.. అన్న ప్రశ్నలు సామాన్యుడిలో తలెత్తుతున్నాయి. మరోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం వల్ల స్టేషన్లలో పోలీసుల నుంచి బాధితులకు స్పందన రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన చాలా నేరాల్లో పాత నేరస్తులే మరోసారి నేరాలకు పాల్పడుతున్నారని, వారిపై సరైన నిఘా లేకపోవడం కూడా నేరాల పెరుగుదలకు కారణమని పోలీసులే చెప్పారు.



### పోలీస్ గస్తీ కనిపించడంలేదు..!

పదేండ్ల పాటు రాష్ట్రంలో శాంతిభద్రతల స్థాపనే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసింగ్‌పై దృష్టిపెట్టింది. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాలు లేని సమయంలో పోలీసు గస్తీ ముమ్మురంగా ఉండి నేరాల నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ సుస్థిరంగా ఉండేదని నగరవాసులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అప్పుడప్పుడు పోలీసుల గస్తీ కొన్నిచోట్ల కనిపించినా వారు పెద్దగా రోడ్డుపై ఏం జరుగుతుందో పట్టించుకునే పరిస్థితిలో లేరనే విమర్శలున్నాయి. తాజా పరిణామాలు చూస్తే పెరుగుతున్న క్రైమ్‌రేట్ ను బట్టి హైదరాబాద్ మరో బీహార్‌గా మారుతుందా అన్న అనుమానం తలెత్తుతోంది.

### ఫీడ్‌బ్యాక్ సెంటర్లకు స్వస్తి..!

తెలంగాణ ఏర్పాటు తర్వాత పోలీసింగ్‌కు ఆనాటి ప్రభుత్వం చాలా ప్రాధాన్యతనిచ్చింది. ప్రతీ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫీడ్‌బ్యాక్ సెంటర్లు ఫిర్యాదుదారుల నుంచి తీసుకునే ఫీడ్ బ్యాక్ కీలకమయ్యేది. గతంలో నేరాలు చేసిన వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారంటూ ఎప్పటికప్పుడు వారిపై నిఘా పెట్టే వ్యవస్థ కూడా సరిగా లేకపోవడం వల్ల ఇటీవల జరిగిన చాలా నేరాల్లో పాత నేరస్తులే మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు.

### విజుబుల్ పోలీసింగ్‌తోనే నేరాలకు చెక్

విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాలు చాలా వరకు అరికట్టవచ్చని పోలీస్ ఉన్నతాధికారులు సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా కలకలం రేపిన జర్మనీ యువతిపై లైంగిక దాడి ఘటనతో శివారు ప్రాంతాల్లో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. కాగా, విదేశీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన యాకత్‌పురాకు చెందిన మహ్మద్ అబ్దుల్ అస్లాంపై గతంలోను కేసులున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. జర్మనీ విద్యార్థినికి నగరాన్ని చూపిస్తానంటూ నమ్మించి కారులో ఎక్కించుకొని వెళ్లి పహాడీషరీఫ్ ప్రాంతంలో అఘాయిత్యానికి పాల్పడిన కామంధుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నిందితుడిని పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు.